పేదల బియ్యం.. పొరుగున బేరం


ఇంటింటా సేకరించిన చౌక బియ్యం

» ఈ ఏడాది ఆగస్టు 14న డీ హీరేహాళ్ మండల కేంద్రంలోని ఓ టీడీపీ నాయకుడి పొలంలో నిల్వ చేసిన బియ్యం ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వెంటనే అప్రమత్తమైన ఆ నాయకుడు..రాత్రికిరాత్రే బియ్యాన్ని ఇతర ప్రాంతానికి చేర్చి, విక్రయించాడు. పోలీసులు ఆచూకీ కోసం ఎంత గాలించినా ప్రయోజనంలేకపోయింది.

» ఈ ఏడాది సెప్టెంబర్ 12న రాత్రి డీ హీరేహాళ్‌లో ఓ టీడీపీ నాయకుడికి చెందిన బియ్యం నిల్వ చేసి ఉండగా పోలీసులు గుర్తించారు. సుమారు 180 ప్యాకెట్ల బియ్యం స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు.

» సెప్టెంబర్ 19న హిర్దేహాళ్ సమీపంలోని ఓ వంకలో నిల్వ చేసిన 210 ప్యాకెట్ల చౌక బియ్యాన్ని పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు.

» ఇటీవల డీ హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో సేకరించిన బియ్యం ఓ వాహనంలో తరలిస్తూ డీహీరేహాళ్ పోలీసులకు పట్టుబడ్డారు. 40 ప్యాకెట్ల బియ్యం రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని, సీజ్‌చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

» కణేకల్లులో ఇటీవల విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమ బియ్యం నిల్వలు పట్టుబడ్డాయి. అధికార పార్టీ అండతో కేసు నమోదు కాకుండా చేయాలని చూశారు. విషయం కాస్త బహిరంగం కావడంతో విధిలేని పరిస్థితిలో కేసు పెట్టారు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు సిండికేట్‌గా మారి భారీగా బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కొందరు అధికారులు తెరచాటుగా సహకరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఈ ప్రాంతంలో ఎన్నో వెలుగు చూస్తుండడం విశేషం.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- జోరుగా చౌక బియ్యం అక్రమ వ్యాపారం
- సరిహద్దులో బరితెగిస్తున్న పచ్చముఠా
- డీ హీరేహాళ్ కేంద్రంగా దందా
- కణేకల్లులో సిండికేట్‌గా మారి అక్రమ రవాణా

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదురం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 504 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఏఏవై 16,745, తెల్ల రేషన్‌కార్డులు 1,84,770, మొత్తం 2,01,515 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా సుమారు 6,33,123 కేజీల బియ్యం సరఫరా అవుతోంది. ఇందులో 20 శాతం బియ్యం మాత్రమే పేదలకు పంపిణీ జరుగుతోంది. మిగిలిన 80 శాతం బియ్యం దళారులు, అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి వ్యక్తికీ ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తోంది. అయితే పేదల బియ్యంతో పచ్చముఠా వ్యాపారం చేస్తోంది. ఊరూరా ఇంటింటికీ వెళ్లి బియ్యం సేకరించి, తక్కువ ధరకు కొనుగోలు చేసి, వ్యాపారం చేస్తున్నారు. ప్రతి నెలా 1 వ తేదీ దాటగానే బియ్యం కొనుగోలు చేస్తారు. కిలోకు రూ.15 నుంచి రూ.18 ప్రకారం చెల్లిస్తారు. వాటిని ఆటోల ద్వారా ఓ చోట నిల్వ చేస్తారు. స్థానికంగా కొనుగోలు చేసే దళారి అయితే రూ.24, అదే కర్ణాటక రాష్ట్రంలోని చెళ్లకెర, బెంగళూరు, తుమకూరు తదితర ప్రాంతాల్లోని మిల్లుకు తరలిస్తే రూ.30 నుంచి రూ.35 తో విక్రయిస్తున్నారు. చెళ్లకెర మిల్లుల్లో చౌక బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చుతున్నట్టు తెలుస్తోంది. వాటిని క్వింటా రూ.3,800 నుంచి రూ.4,200లకు గ్రామాల్లో తిరిగి విక్రయిస్తూ దోపిడీకి తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోనామసూరి బియ్యం అనుకొని గ్రామాల్లో అధిక ధరకు కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. ఇంకొందరు కోళ్లఫారాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చౌక దుకాణం దాటగానే సంచి మార్చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు సరఫరా అవుతున్న చౌక బియాన్ని కొందరు బొక్కేస్తున్నారు. ఎన్నో కుటుంబాల ఆకలిబాధలు తీర్చే నోటికాడ కూడు లాగేసుకుంటున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. చౌక దుకాణం దాటగానే సంచి మార్చేస్తున్నారు. ఆటోల ద్వారా నిల్వలు పేర్చి చీకటి పడగానే కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తూ ..రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు.

జాతీయ రహదారిపైనే రవాణా

బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారి అక్రమార్కులకు మార్గమైంది. చీకటి పడగానే ఈ మార్గంలో బియ్యం తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో సేకరించిన బియ్యం ఈ మార్గం మీదుగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. కణేకల్లులో కొందరు సిండికేట్‌గా ఏర్పడి ఈ వ్యాపారం చేస్తున్నట్లు జనం బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిరాగానే ఓ ముగ్గురు వ్యక్తులు సిండికేట్‌గా మారి ఈ మాఫియాలో ఆరితేరిపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి.

“ చర్యలు చేపడతాం



సరిహద్దులో చౌక బియ్యం తరలిపోకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తాం. ఎక్కడైనా అక్రమ బియ్యం నిల్వలు ఉన్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చు. వెంటనే దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకుంటాం. బాధ్యులపై కేసులు నమోదు చేయిస్తాం. కార్డుదారులు బియ్యం అమ్ముకుంటే కఠిన చర్యలు చేపడతాం. అవసరం ఉంటేనే బియ్యం తీసుకోవాలి. కేవలం కార్డు కోసం వేలిముద్రలు వేసి బియ్యం అమ్ముకుంటే సహించేది లేదు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుంటే చర్యలు


అనుంపల్లిలో ఆలయ ప్రవేశంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు

శెట్టూరు: దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుంటే చర్యలు ఉంటాయని ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు తెలియజేశారు. మండలంలోని అనుంపల్లిలో గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలోకి దళితుల ప్రవేశంపై ఆర్డీఓ, డీఎస్పీ రవిబాబు అవగాహన కల్పించారు. గ్రామంలో దళితుల ఆలయ ప్రవేశంపై అగ్రవర్ణాలు, దళితులకు మధ్య వాగ్వాదం జరగగా, ఎస్ఐ రాంభూపాల్ కల్పించుకొని దళితులకు ఆలయ ప్రవేశం కల్పించారు. దీనిపై అగ్రవర్ణాలు సుముఖత చూపకపోగా, ఆర్డీఓ, డీఎస్పీతో పాటు మండల స్థాయి అధికారులు మంగళవారం పర్యటించి దళితుల ఆలయ ప్రవేశంపై అవగాహన కల్పించారు. ఇరువర్గాలను గ్రామంలో సమావేశ పరిచి, గ్రామంలో ప్రశాంత జీవనం సాగించాలని, అందరూ కలసిమెలసి జీవించాలని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, సీఐ నీలకంఠేశ్వర, ఎస్ఐ రాంభూపాల్, సర్పంచ్ పాలయ్య, ఎంపీటీసీ బీటీ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలాక్షప్ప, ప్రభాకర్, బాలజీ, గ్రామ పెద్దలు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెట్టి తిప్పేస్వామి, రామన్న, మారెన్న, మహేష్, పాల్గొన్నారు.

13న రైతు సమస్యలపై జిల్లా కేంద్రంలో ర్యాలీ

- మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఈనెల 13న జిల్లా కేంద్రంలో జరగనున్న రైతు సమస్యలపై ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ప్రతిపక్షాలు, మేధావులు, రైతు సంఘాలు మద్దతు తెలపాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలనుకూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఉద్యాన రైతులకు మార్కెటింగ్ సౌకర్యం, సాగునీటి రంగానికి ప్రాధాన్యత పై ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. ఉదయం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

కూడేరు: రైతులు, రైతాంగ సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కూడేరులోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతింటున్నాయని, గిట్టుబాటు ధర లేక రైతులు నష్ట పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై స్పందించలేదని మండిపడ్డారు. రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడేందుకు సిద్ధమైందన్నారు. ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్ రామచంద్రా రెడ్డి, నేతలు మంజునాథ్ రెడ్డి, రామచంద్ర, రామాంజనేయులు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సదస్సులెందుకు?

- అధికారులను ప్రశ్నించిన రైతులు, ప్రజలు


ఉదిరిపికొండలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు, ప్రజలు

కూడేరు: ఎన్ని సార్లు అర్జీలిచ్చిన సమస్యలే పరిష్కారం కావు.. మళ్లీ ఇప్పుడు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నారు. దీంతో ఒరిగిందేమీలేదు.. రెవెన్యూ సదస్సు మాకొద్దంటూ రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. మంగళవారం ఉదిరిపికొండలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 121 అర్జీలు వచ్చాయి. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ చౌదరి, డీటీ సూర్య ప్రతాప్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, సర్వేయర్ అయేషా సిద్ధిక్, వీఆర్వో లక్ష్మన్న పాల్గొన్నారు.

శెట్టూరు: భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ వసతబాబు పేర్కొన్నారు. మంగళవారం ములకలేడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ హాజరయ్యారు. రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు విన్న ఆర్డీఓ ..రైతులు సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి సూచించాంచారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ లింగప్ప, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: గ్రామ రెవెన్యూ సదస్సుకు ఏడు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 75వీరాపురం గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పొజిషన్ సర్టిఫికెట్ల కోసం-4, రస్తా సమస్యలపై-3 వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ రఘు, ఆర్ఐ రామాంజనేయులు, సర్పంచ్ నాగరాజుపాల్గొన్నారు.

బొమ్మనహాళ్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు, మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 22 అర్జీలు వచ్చాయి.

వజ్రకరూరు: పందికుంటలో తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 15 అర్జీలు వచ్చినట్లు వీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, ఎంపీటీసీ నారాయణస్వామి, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌నాయుడు, వీఆర్‌ఓ శ్రీధర్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: శ్రీరంగాపురం రెవెన్యూ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ షర్మిళ తెలిపారు. స్థానిక శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో శ్రీరంగాపురం, బూదివర్తి, నక్కలపల్లి రైతులు వినతులు అందించారు. నక్కలపల్లి సర్పంచ్ రామిరెడ్డి, కార్యదర్శి శ్రీరాములు, వీఆర్‌ఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: రెవెన్యూ సదస్సుల్లో సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలి పారు. మంగళవారం అప్పిలేపల్లిలో సదస్సు నిర్వహించారు. ఆర్ఐ పోతన్న, వీఆర్‌ఓ తిమ్మయ్య, గ్రామ సర్పంచ్ అతావుల్లా రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన వెంటనే సమస్య పరిష్కారం

కళ్యాణదుర్గం రూరల్: పాలవాయిలో అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాలవాయికి చెందిన నల్లప్పకు అంజనమ్మ అనే మహిళకు రస్తా వివాదం ఉంది. దీనిపై నల్లప్ప రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశాడు. వెంటనే తహసీల్దార్ భాస్కర్ క్షేత్రస్థాయిలో పర్యటించి, రస్తా సమస్యను అక్కడికక్కడే పరిష్కరించాడు.

కనులపండువగా చన్నమల్లప్ప జాతర


అశ్వరథంపై దర్శనమిస్తున్న చన్నమల్లప్ప స్వామి


జాతరలో పాల్గొన్న భక్తులు

బ్రహ్మసముద్రం : మండలంలోని సూగేపల్లిలో ఆరూఢ చన్నమల్లప్ప స్వామి జాతర కనులపండువగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి చన్నమల్లప్ప స్వామి మఠం నుంచి అశ్వ రథంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు ఆంధ్ర , కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయం నుంచి సజీవ సమాధుల వరకు దుకాణాలు వెలిశాయి. భక్తులతో దుకాణాలు కిటకిటలాడాయి. ఎస్ఐ నరేంద్ర కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

రాయదుర్గంటౌన్: పాత మున్సిపల్ కార్యాలయం ముందు వేతన బకాయిల కోసం మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు మంగళవారం తెల్లవారు జామున ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ జీవో నంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం

కుందుర్పి: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితమని వైద్యాధికారిణి చాంద్ బేగం పేర్కొన్నారు. మంగళవారం మహంతపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్, పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని 39 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

నాగేంద్రకు జేపీసీ నాయకుల పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: దళిత నాగేంద్రపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ జేపీసీ నాయకులు చెలిమప్ప కోరారు. మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేంద్రను పరామర్శించారు. చెలిమప్ప మాట్లాడుతూ శెట్టూరు మండలంలోని యాటకల్లుకు చెందిన నాగేంద్రను మంగళవారం ఉదయం చాకలి తిప్పేస్వామి, అతని బంధువులు దాడిచేశారు. ఈదాడిలో గాయపడిన నాగేంద్ర ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పి.నాగిరెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కూడేరు: పి.నాగిరెడ్డిపల్లిలో మురళి అనే రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేసి, అందులోని కాపర్ ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ట్రాన్స్‌కో, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

గుమ్మఘట్ట: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్

సంక్షిప్త సమాచారం

2024–25 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికలు , అభివృద్ధి లక్ష్యాలపై సమావేశాలుంటాయని ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 11 నుంచి 16 వరకు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఒకే ఈతలో రెండు దూడలు



రాయదుర్గం: 74 ఉడేగోళంలో రైతు వరకూటి హంపారెడ్డి ఆవు మంగళవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒకటి పెయ్యదూడ అని తెలిపారు. రెండు దూడలూ ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపాడు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీ, ఎస్టీ రైతుల కోసం అమలు చేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ తెలిపారు. మంగళవారం మండలంలోని కామక్కపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ మాట్లాడుతూ కార్యక్రమంలో బాద్రహళ్లి ఆర్ఎస్‌కే సిబ్బంది, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

కూడేరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఏఓ విజయ కుమార్ తెలిపారు. మంగళవారం కలగ్ళ, పి.నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ, వరి, కంది పంటలకు సోకే తెగుళ్ల, మందులను ఏఓ తెలియజేశారు. హెచ్‌ఓ నెట్టికంటయ్య, వీహెచ్‌ఏ గిరీష్ పాల్గొన్నారు.

మానవహక్కుల దినోత్సవం

రాయదుర్గం: 74 ఉడేగోళం సమీపంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాబు, దేవదాసు, రఘు, హరి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణ, దొడ్డనాగప్ప, కొండదం రాములు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో గర్భిణులు, సహాయకులకు ఆమిద్యాలకు చెందిన పిండి జిన్నా నిర్వాహకులు అబ్దుల్లా, కుమారులు నబీరసూల్, శర్మాస్‌వలి పౌష్టికాహారాన్ని అందించారు. మంగళవారం డాక్టర్ పావని గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.హెల్త్ ఎడ్యుకేటర్‌షఫీ, ఎంపీహెచ్‌ఎస్ శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మేలైన దిగుబడి

కణేకల్లు: పప్పుశనగ సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే మేలైన దిగుబడి సాధించొచ్చని ఏడీఏ లక్ష్మానాయక్, కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మాల్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. పప్పుశనగ పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. ఎండుతెగుళ్ల నివారణకు శనగ విత్తే సమయంలో విత్తనశుద్ధి చేయాలన్నారు. ట్రైకోడెర్మావిరిడి లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ అనే జీవనియంత్రణ మందు 8 గ్రాములు (కేజీ విత్తనానికి) బెల్లం నీటితో పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పప్పుశనగ పంటకు పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించడానికి ఈనెల 15 వరకు గడువుందన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

కణేకల్లు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలో 11 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. బొమ్మనహాళ్ మండలంలో ఏడు, కణేకల్లు మండలంలో 3, విడపనకల్లు మండలంలో పాల్తూరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. బొమ్మనహాళ్ మండలంలో హరేసముద్రం, ఉద్దేహాళ్, బండూరు, కొలగానహళ్లి, శ్రీధరఘట్ట, బల్లనగుడ్డం, కల్లుదేవనహళ్లి సాగునీటి వినియోగదారుల సంఘాలుండగా, కణేకల్లు మండలంలో బెణికల్లు, 43 ఉడేగోళం, కణేకల్లు చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం, విడపనకల్లు మండలంలో పాల్తూరు సాగునీటి వినియోగదారుల సంఘం ఉంది. మైనర్ ఇరిగేషన్‌శాఖ పరిధిలో కె.కొత్తపల్లి, కోళకుర్తి చెరువు సాగునీటి వినియోగదారుల సంఘాలున్నాయి.14న ఎన్నికలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.

నేత్రపర్వంగా జగదీశ్వరీ గ్రామోత్సవం


జగదీశ్వరి అమ్మవారు


కలశాలతో గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఉరవకొండ: పట్టణంలోని గుంతకల్లు రోడ్డు వద్ద ప్రసిద్ధిగాంచిన జగన్మాత జగదీశ్వరి అమ్మవారి గ్రామోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో 108 కలశాలతో మహిళలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. వందలాది రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన ముత్యాల వాహనంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. శాంతానంద రంగయ్యస్వాముల చిత్రపటాన్ని మరో వాహనంలో ఉంచి విశేషంగా అలంకరించారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లోని సహకార సొసైటీల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, తహసీల్దార్ మునివేలు, ఏఓ సాయికుమార్ తెలిపారు. మంగళవారం ఉద్దేహాళ్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 11,165 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. వరి మద్దతు ధర ఏ గ్రేడ్ఎకరానికి రూ. 2,320, కామన్ వరి రకానికి రూ. 2,300 ప్రకారం ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు తెలిపారు. 2024 ఖరీఫ్‌లో ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైజీ చేసుకున్న రైతులందరూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరిసరాలశుభ్రతతోనే ఆరోగ్యం

రాయదుర్గంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కదరంపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, దోమల అరికట్టడంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ చేసి, వ్యాధుల నియంత్రణపై తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కొల్లక్క, హెల్త్ అసిస్టెంట్ నరసింహ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుతో లాభాలు

ఉరవకొండ: ఆయిల్ ఫాం సాగుతో అధిక లాభాలు పొందొచ్చని ఉద్యాన శాఖ అధికారి నెట్టికంఠయ్య, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని నెరిమెట్ల గ్రామంలో ఆయిల్‌ఫాం సాగు, మిరప సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ యోగేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి జిల్లాలో ఆయిల్ ఫాం సాగు కోసం ఎంపికైన ఆరు మండలాల్లో ఉరవకొండ కూడా ఉందన్నారు. ఆర్మీ ఏపీఎం కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మహమ్మద్ మృతి



వజ్రకరూరు: మండల కేంద్రానికి చెందిన సింగిల్‌విండో మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పామిడి మహమ్మద్ (52) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య పామిడి మాబున్నిసా, ఇద్దరు కుమార్తె లు ఉన్నారు. పామిడి మాబున్నీసా ప్రస్తుతం వార్డు సభ్యురాలుగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వెంటనే ఫోన్‌లో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పామిడి మహమ్మద్ మరణం వైఎస్సార్‌సీపీకి తీరనిలోటన్నారు.

దర్గా హొన్నూరు స్వామి ఉరుసు ప్రారంభం

వజ్రకరూరు: చాబాలలో దర్గాహొన్నూరు స్వామి ఉరుసు మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం రాత్రి గంధం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి కరె నాగప్ప ఇంటి నుంచి ఊరేగింపుతో గంధం దర్గాకు చేరుకుంది.

నేడు స్వామి ఉరుసు మహోత్సవం: బుధవారం స్వామి ఉరుసు జరుగుతున్నట్లు దర్గా కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం చక్కెర చదివింపులు, రాత్రి గ్రామంలోని కొమ్మే కుళ్లాయప్ప ఇంటి నుంచి షంషీర్ దర్గా చేరుతుందన్నారు. అనంతరం రాత్రి 2 గంటల నుంచి స్వామి దర్గా నుంచి బయల్దేరి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తిరిగి దర్గా చేరుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభా పోటీలకు విద్యార్థిని ఎంపిక


రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభా పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని అశ్రిత రాష్ట్ర స్థాయి కౌశల్ 2024 సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం రాజేశ్వరీ, సీనియర్ గణిత ఉపాధ్యాయులు వెంకట్ తాడికొండ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి ఏపీ కాస్ట్, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీల్లో జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచిందన్నారు. ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పోస్టర్ ప్రెజెంటేషన్ అనే అంశంలో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు.

సీపీఐ నిరసన

కళ్యాణదుర్గం రూరల్: ఆదానిని అరెస్టు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆదాని దిష్టి బొమ్మను ఊరేగించి టీసర్కిల్లో నిరసన తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు మల్లికార్జునకు నివాళి


జర్నలిస్టు మల్లికార్జున మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

ఉరవకొండ: సీనియర్ జర్నలిస్టు మల్లికార్జున (57) అనారోగ్యంతో ఈనెల 9న కన్నుమూశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం నాయకుడు అశోక్ తదితరులు అనంతపురంలోని మల్లికార్జున ఇంటికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాకెట్ల గ్రామస్తుడైన మల్లికార్జున సీనియర్ జర్నలిస్టుగా సేవలు అందించారన్నారు. జర్నలిస్టు వృత్తికే వన్నె తెచ్చేలా పనిచేశారన్నారు.

నేటి నుంచి ఎస్ఏ టర్మ్–1 పరీక్షలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో బుధవారం నుంచి సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 285 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 48,198 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎఈఓ నాగమణి తెలిపారు. 11 నుంచి 19 వరకు ఎస్ఏ టర్మ్–1 పరీక్షలు జరుగుతాయని, 1 నుంచి 5వ తరగతి వరకు 11న తెలుగు లేదా ఉర్దూ, 12న ఇంగ్లిష్, 13న గణితం , 16న ఈవీఎస్ పరీక్షలు జరుగుతాయన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 11న తెలుగు, ఉర్దూ, 12న హిందీ, 13న ఇంగ్లిష్, 16న గణితం, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 19న సాంఘిక పరీక్ష జరగనున్నట్లు తెలిపారు.

ఎరుకుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిస్తాం


ఎరుకుల సేవా సంఘం నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర నాయకులు

ఉరవకొండ: ఎరుకుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్ నారాయణ స్వామి, సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ తెలిపారు. మంగళవారం ఉరవకొండలో ఎరుకుల సేవా సంఘం నూతన నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఎరుకుల కులస్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఎరుకులు రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఎరుకులకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన వాటిపై కూడా న్యాయబద్ధంగా పోరాటాలు చేసి సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎరుకుల సేవా సంఘం నాయకులు పురుషోత్తం, వసంత్, వీరేంద్ర, విరేష్, గోవిందు, సత్యప్ప, శేషాద్రి, సుబ్బరాయుడు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.